నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
18 సెప్టెంబర్ 2024
పేజీలు: 02



# పదేళ్ల తర్వాత జమ్మూ అసెంబ్లీకి ఎన్నికలు

దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూ అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ బుధవారం ఉదయం ప్రారంభమైంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ.. తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ ప్రారంభమైన రెండు గంటల వ్యవధిలోనే (ఉదయం 9 గంటల వరకూ ) 11.11 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా, ఏడు జిల్లాల పరిధిలోని 24 అసెంబ్లీ స్థానాల్లో 219 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 23 లక్షల మంది ఓటర్లు తొలి విడుతలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మరాజ్ రీజియన్‌లోని అనంత్ నాగ్, పుల్వామా, కుల్గాం, షోపియాన్ జిల్లాలు, చీనాబ్ లోయలోని డోడా, కిశ్త్ వాడ్, రాంబన్ జిల్లాల్లో పోలింగ్ కొనసాగుతోంది. పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పుర, జైనాపుర, షోపియాన్, డీహెచ్ పుర, కుల్గాం, దేవ్‌సర్, దూరు, కోకెర్‌నాగ్, అనంత్ నాగ్ వెస్ట్, అనంత్ నాగ్, శ్రీగుఫ్వారా – బిజ్‌బెహరా నియోజకవర్గాలు కీలకంగా ఉన్నాయి. బీజేపీ, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఎన్‌సీతో కాంగ్రెస్ పొత్తులో ఉంది.

## ప్రజాస్వామ్య పండుగను బలోపేతం చేయండి..

# జమ్మూ ఓటర్లకు మోదీ పిలుపు



దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూ అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ బుధవారం ఉదయం ప్రారంభమైంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ.. తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ పోలింగ్ నేపథ్యంలో ఓటర్లుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక విజ్ఞప్తి చేశారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ ప్రారంభమైందని, ఈరోజు పోలింగ్ జరుగుతున్న అన్ని నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజా స్వామ్య పండుగను బలోపేతం చేయాలని కోరారు. ప్రత్యేకించి యువతీ యువకులు, మొదటిసారి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు.

## అటు రేవంత్ రెడ్డి.. ఇటు కేటీఆర్..

# ఒకే వేదికపైకి రాజకీయ ప్రత్యర్థులు



కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. మాటల తూటాలు ఎలా పేలుతాయో మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. వార్ వన్ సైడ్ కాదు.. టూ సైడ్.. అనేలా ఉంటాయి.. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సవాళ్లు ఎలా ఉంటాయో ఇంకా చెప్పాల్సిన పనే ఉండదు.. ప్రస్తుతం వాళ్లిద్దరి మధ్యనే మాటల యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది.. ఏ విషయం పైనేనా.. వాళ్లిద్దరూ హోరాహోరీగా సవాళ్లు చేసుకుంటుంటారు.. ప్రస్తుతం కేటీఆర్, రేవంత్ రెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒకరిపై ఒకరు విపరీతమైన భాషలో విరుచుపడుతున్నారు. ప్రతిరోజు ఇద్దరి మధ్య ట్వీట్ల వార్ కూడా నడుస్తుంది. అసెంబ్లీలోనూ అదే కొట్లాట.. రాజకీయంగానే అదే పొట్లాట.. రాజకీయంగా రెండు విభిన్న పార్టీలు రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు.. ఇటు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, అటు ప్రతిపక్ష పార్టీ నేతగా కేటీఆర్.. డైలీ ఏదో ఒక విషయంపై స్పందిస్తుంటారు. గతంలో కంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇద్దరి మధ్య తీవ్ర రాజకీయ యుద్ధం నడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఇద్దరూ.. ఒకే వేదికను పంచుకోనున్నారు. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుంది. అదేంటి..? ఇద్దరూ ఒకే వేదికపై వస్తారా..? ఈ క్రమంలో ఇద్దరూ పలకరించుకుంటారా? ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటారా? అనేది అందరిలోనూ ఆసక్తి రేపుతోంది.. అయితే.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసిఆర్ ఆసుపత్రిలో ఉండగా వెళ్లి పరామర్శించారు. ఆ సందర్భంలో కేటీఆర్ స్వయంగా ఆసుపత్రిలో దగ్గరుండి తీసుకెళ్లారు. ఇద్దరు ఆప్యాయంగానే మాట్లాడుకున్నారు. కానీ అప్పటికి ఇప్పటికీ పరిస్థితి వేరు.. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష పార్టీ సీపీఎం నిర్వహించే సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో ఇద్దరూ వేదికపై కనిపించనున్నారు. సెప్టెంబర్ 21న వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఉంది. ఆయన తెలుగు వ్యక్తి కావడంతో హైదరాబాదులో ఆ పార్టీ సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటు సీఎం రేవంత్ రెడ్డిని అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరినీ ఆహ్వానించారు. రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. సీతారాం ఏచూరి గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని ఇద్దరు కచ్చితంగా హాజరయ్యే అవకాశం ఉంది. ఒకే వేదికపై ఇద్దరు రాజకీయ బద్ధ శత్రువులు కూర్చోనున్నారు. సమావేశం ఏదైనా ఇద్దరు ఒకరినొకరు ఎలా పలకరించుకుంటారు అనేది ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది.



# అంకెలు ఎప్పుడూ అబద్ధం చెప్పవు..

## కేసీఆర్ సాధించిన విజయాలు ఎప్పటికీ చెదిరిపోవు

కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిన సంగతి తెలిసిందే. అన్ని రంగాల్లోనూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. జాతీయ సగటు కంటే అధిక తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్వయంగా కేంద్రమే పేర్కొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అత్యంత అద్భుతంగా అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చెప్పిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చెందింది అనడానికి ఇంతకన్న సాక్ష్యం ఏం కావాలని అడిగారు. కేవలం తొమ్మిదిన్నరేండ్లలో జాతీయ సగటు కంటే 94 శాతం అధిక తలసరి ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్రం నమోదు చేసిందన్నారు.



# హుస్సేన్ సాగర్‌లో కొనసాగుతోన్న నిమజ్జనం..

ఖైరతాబాద్, లక్డీకాపూల్‌లో భారీగా ట్రాఫిక్ హుస్సేన్ సాగర్‌లో గణనాథుల నిమజ్జన ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇంకా కొన్ని వందల గణనాథులు గంగమ్మ ఒడికి చేరేందుకు బారులు తీరాయి. దీంతో ఖైరతాబాద్, లక్డీకాపూల్, లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఇవాళ వర్కింగ్ డే కావడంతో ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు, ఇతరులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీజీపీ జితేందర్ పోలీసులను ఆదేశించారు. ఇక గణనాథుల నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం వరకు నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గ్రేటర్‌లో సాఫీగా నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు 1,02,510 గణనాథుల విగ్రహాల నిమజ్జనం జరిగిందన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 71 ప్రాంతాలలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అత్యధికంగా మూసాపేట ఐడీఎల్ చెరువులో 26,546 విగ్రహాలు, ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో 4,730, నెక్లెస్ రోడ్డు 2,360, పీపుల్స్ ప్లాజా 5,230, అల్వాల్ కొత్త చెరువులో 6,211 విగ్రహాల నిమజ్జనం జరిగిందన్నారు.





# స్టన్నింగ్‌గా ఉపేంద్ర యూఐ లుక్

తెలుగు ప్రేక్షకులకు ఇంట్రడక్షన్ అవసరం లేని కన్నడ స్టార్ యాక్టర్ ఉపేంద్ర. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ ప్రస్తుతం పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో 'యూఐ' సినిమా చేస్తున్నాడని తెలిసిందే. మనోహరన్-శ్రీకాంత్ కేపి సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన సౌండ్ ఆఫ్ యూఐ సినిమా ఎలాంటి థీమ్‌తో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఉపేంద్ర అశ్వంపై యుద్ధవీరుడిలా కనిపిస్తున్న లుక్ గూస్ బంప్స్ తెప్పిస్తూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తోంది. నిబంధనలను నిర్వచిస్తూ ఓ వెలుగు వెలిగిన రియల్ స్టార్ ఉపేంద్రకు హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు. మేకింగ్‌లో హిస్టరీ.

# శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల

## 23న అంగప్రదక్షిణ టోకెన్లు జారీ



తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి డిసెంబర్ కోటా టికెట్లు నేడు(బుధవారం) విడుదలకానున్నాయి. ఉదయం 10గంటలకు ఆన్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేయనున్నది. ఈ-సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 18న ఉదయం10గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ టీటీడీ పేర్కొన్నది. 21న ఉదయం 10గంటలకు ఊంజల్ సేవ, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్ల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే అంగప్రదక్షిణ టోకెన్లను 23న ఉదయం 10గంటలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఉదయం 11 గంటలకు, వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్లను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

# ప్రధాని మోదీని కలుస్తా: ట్రంప్



ప్రధాని నరేంద్ర మోదీ .. ఈనెల 21 నుంచి అమెరికాలో టూర్ చేయనున్నారు. అయితే ఆ సమయంలో ఆయన్ను కలవనున్నట్లు అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. మిచిగన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రధాని మోదీ అద్భుతమైన వ్యక్తిని అని ట్రంప్ కీర్తించారు. తనను కలిసేందుకు మోదీ అమెరికా వస్తున్నారని ట్రంప్ వెల్లడించారు. కానీ ఎక్కడ, ఎప్పుడు ఎలా వాళ్ల భేటీ ఉంటుందో స్పష్టంగా తెలియదు. సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు జరిగే క్వాడ్ సమావేశాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. విల్మింగ్టన్‌లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సు జరగనున్నది.



# సీరత్ హాట్ గ్లామర్ ట్రీట్

సీరత్ కపూర్.. మోడలింగ్ రంగం నుంచి సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. సినిమాల్లో ముందుగా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి ఆపై హీరోయిన్ గా ప్రమోషన్ పొందింది. ఆ తర్వాత తెలుగులో సరైన హిట్స్ లేక రేసులో వెనకబడింది. దీంతో వరుసగా హాట్ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాను హీటెక్కిస్తోంది. సీరత్ కపూర్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ ప్రారంభించి ఆపై కథానాయిక అయింది. అంతేకాదు తొలి సినిమాతో మంచి హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. 2014లో శర్వానంద్ హీరోగా తెరకెక్కిన'రన్ రాజా రన్' మూవీతో కథానాయికగా ఇంట్రడ్యూస్ అయింది. ఈ సినిమా సక్సెస్ అయినా.. ఈ అమ్మడికి పెద్దగా బ్రేక్ లభించలేదు. ఆ తర్వాత తెలుగులో 'టైగర్', 'కొలంబస్', 'రాజు గారి గది 2', 'ఒక్క క్షణం', 'టచ్ చేసి చూడు', కృష్ణ అండ్ హీజ్ లీలా', మా వింత గాథ వినుమా' వంటి చిత్రాలతో పలకరించింది. ఈ సినిమాలేవి సీరత్ ఫేట్ ను మార్చలేకపోయాయి. అందుకే సినిమాల్లో ఛాన్సుల క్సం సీరత్ కపూర్ ఇపుడు వరుసగా హాట్ ఫోటో షూట్స్ ను నమ్ముకుంది. దీంతో పూటకో ఫోటో షూట్ తో సోషల్ మీడియాను హీట్ ఎక్కిస్తోంది. సీరత్ కపూర్ 1993 ఏప్రిల్ 3న జన్మించింది. కెరీర్ మొదట్లో మోడల్ గా రాణించి ఆపై కథానాయిక ప్రమోషన్ పొందింది. ఆకట్టుకునే గ్లామర్ ఉన్న ఈమెకు ఇప్పటికీ సరైన అవకాశాలు లేక వరుస ఫోటో షూట్స్ తో చెలరేగిపోతుంది.




# ఇన్‌స్టాగ్రామ్‌లో టీనేజర్ల ప్రైవసీ కోసం కొత్త ఫీచర్

టీనేజ్ యూజర్ల ప్రైవసీ కోసం ఇన్‌స్టాలో 'టీన్ అకౌంట్స్' ఫీచర్ రానుంది. దీనితో 13-17ఏళ్ల వయసున్న యూజర్ల అకౌంట్లు ఆటోమేటిక్‌గా ప్రైవేట్‌లోకి వెళ్తాయి. వారి కంటెంట్ ఫాలోవర్స్‌కు మాత్రమే కనిపిస్తుంది. వీరు యాక్సెప్ట్ చేస్తేనే కొత్త ఫాలోవర్స్ యాడ్ అవుతారు. పేరెంట్‌ను యాడ్ చేసి వారి అనుమతితో ఈ సెట్టింగ్స్ మార్చుకోవచ్చు. త్వరలో అమెరికా, ఆస్ట్రేలియా,కెనడాలో, 2025 జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా ఇది అందుబాటులోకి రానుంది.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com




## కేంద్రం కీలక నిర్ణయం.. పీఎఫ్ విత్ డ్రా లిమిట్ పెంపు..

# ఒకేసారి రూ.1 లక్ష తీసుకోవచ్చు?

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సబ్స్క్రైబర్లకు అదిరే శుభవార్త అందించింది కేంద్రం. ఉద్యోగులు ఇకపై తమ వ్యక్తిగత ఆర్థిక అవసరాల కోసం లక్ష రూపాయల వరకు విత్ డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవియా మంగళవారం వివరాలు వెల్లడించినట్లు హిందుస్తాన్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. ఇప్పటి వరకు పీఎఫ్ ఖాతా నుంచి ఒకసారి గరిష్ఠంగా రూ.50 వేలు మాత్రమే ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.1 లక్షకు పెంచుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారని తెలిపింది. కేంద్ర కార్మిక శాఖ కొద్ది రోజులుగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆపరేషన్స్‌లో పలు మార్పులు చేసింది. అందులో ప్రధానంగా కొత్త డిజిటల్ ఫ్రేమ్‌వర్క్, పీఎఫ్ ఖాతా నిర్వహణ సులభతరం చేయడం, ఫిర్యాదులపై త్వరగా స్పందించేందుకు గల మార్గదర్శకాల వంటివి ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. అలాగే కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు తమ ఉద్యోగ కాలం 6 నెలల గడవక ముందే పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు 6 నెలలు గడిచే వరకు డబ్బులు తీసుకునేందుకు అవకాశం లేదు. ఆ ఆంక్షల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ అనేది కోటి మందికి పైగా ఉద్యోగులకు రిటైర్మెంట్ ఆదాయం కల్పిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ఓ సేవింగ్స్ వడ్డీ రేటు 8.25 శాతంగా ఉంది. మధ్య తరగతి వేతన జీవులకు ఈ వడ్డీ రేటు చాలా కీలకంగా ఉంటుందని చెప్పవచ్చు. మరోవైపు.. ఈపీఎఫ్ఓలో సభ్యత్వం లేని ఆర్గనైజేషన్లు ప్రభుత్వ రిటైర్మెంట్ ఫండ్ మేనేజర్లతో చేరేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. పలు సంస్థలు సొంత ప్రైవేట్ రిటైర్మెంట్ స్కీమ్స్ అమలు చేస్తున్నాయి. 1954లో ఈపీఎఫ్ఓ ఏర్పాటు చేయక ముందు నుంచే ఉన్న ఫండ్స్ అలాగే కొనసాగుతున్నాయి. ఇప్పుడు అవి ఈపీఎఫ్ఓలే చేరేందుకు కేంద్రం అనుమతిస్తోంది. మొత్తంగా 17 కంపెనీలు ప్రైవేట్ రిటైర్మెంట్ స్కీమ్స్ రన్ చేస్తున్నాయి. వాటిల్లో రూ.1000 కోట్లకుపైగా నిధులు ఉన్నట్లు సమాచారం.

## ఇజ్రాయెల్ గాజా యుద్ధానికి

# ముగింపు పలకాలి

### కమలా హారిస్



గతేడాది మొదలైన ఇజ్రాయెల్- గాజా యుద్ధంలో వేల మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ యుద్ధానికి ముగింపు పలకాలని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్- పాలస్తీనా ఎన్‌క్లేవ్‌ను తిరిగి ఆక్రమించవద్దని సూచించారు. అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదుల మెరుపు దాడుల నేపథ్యంలో.. అందుకు ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 41,252 మందికిపైగా మృతి చెందగా.. 95,497 మందికిపైగా గాయపడినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఫిలడెల్ఫియాలో జరిగిన విలేకరుల సమావేశంలో హారిస్ మాట్లాడారు. "ఇజ్రాయెల్, పాలస్తీనా హమాస్ మిలిటెంట్ల మధ్య కాల్పుల విరమణ జరగాలి. ఇరాన్ శక్తిమంతం కాకుండా పశ్చిమాసియా స్థిరత్వాన్ని సాధించాలి. ఇది ఆ ప్రాంతంలోని ప్రతి ఒక్కరికీ ఎంతో మేలు చేస్తుంది" అని కమల అన్నారు. వలసదారులపై రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఇది ద్వేషపూరితమైనదిగా అభివర్ణించారు. అమెరికాలో ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక శ్రేయస్సు వంటివి ప్రస్తుతం ప్రజలను ప్రభావితం చేసే పెద్ద సమస్యలలో ఒకటిగా హారిస్ వ్యాఖ్యానించారు.

**ట్రంప్‌నకు హారిస్ ఫోన్‌కాల్..**

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు కమలా హారిస్ ఫోన్ చేసి పరామర్శించినట్లు వైట్ హౌస్ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రమాదం నుంచి ట్రంప్ క్షేమంగా బయటపడినట్లు తెలుసుకుని హారిస్ సంతోషం వ్యక్తం చేశారని వెల్లడించింది.

### ఆరోజు చిరంజీవి గన్‌తో వాళ్లను బెదిరించారు: మెగాస్టార్ రియల్ హీరో అని చెప్పిన సుహాసిని

ఇండస్ట్రీలోని బెస్ట్ ఫ్రెండ్స్ లిస్ట్‌లో చిరంజీవి-సుహాసిని మొదటి స్థానంలోనే ఉంటారు. 1980 - 1990ల్లో వీళ్లిద్దరూ ఎన్నో సినిమాలతో అలరించారు. తాజాగా మెగాస్టార్‌ను సుహాసిని ప్రశంసించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో వీడియో కాల్‌లో చిరుతో మాట్లాడుతున్న సుహాసిని వాళ్ల సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఓ సంఘటనను ఆయనకు గుర్తుచేశారు. 'చిరంజీవి నా హీరో. అందరికీ ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఒకసారి మేం షూటింగ్ కోసం కేరళలోని ఓ ప్రాంతానికి వెళ్లాం. ముందు కారులో చిరంజీవి వెళ్తున్నారు. వెనక కారులో నేను, డ్యాన్స్ మాస్టర్, హెయిర్ డ్రెస్సర్ ఉన్నాం. అనుకోకుండా కొందరు తాగుబోతులు మా కారును వెంబడించారు. కారుపై బీరు బాటిల్స్ వేశారు. ఇది చూసిన చిరంజీవి.. వెంటనే తన కారు దిగి వాళ్లను గన్‌తో బెదిరించారు. దీంతో వాళ్లంతా పారిపోయారు. హీరోయిజం అంటే కెమెరా ముందే కాదు.. రియల్ లైఫ్‌లో కూడా అలానే ఉండడం' అంటూ చిరుపై ప్రశంసలు కురిపించారు. 'ఈ సంఘటన మీకు గుర్తుందా' అని చిరంజీవిని సుహాసిని అడగ్గా.. 'గుర్తుంది. వాళ్లు మిమ్మల్ని వెంబడించడం అనూహ్య పరిణామం' అని మెగాస్టార్ చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియోను చిరు అభిమానులు షేర్ చేస్తున్నారు. ఈ వీడియో ఎప్పటిది.. పూర్తి వీడియోను షేర్ చేయండి అని మరికొందరు కామెంట్స్‌లో అడుగుతున్నారు.



## రూ.170కి చేరిన

# వంట నూనె

వంట నూనె ధరలు పెరగడం సామాన్యులకు ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల నూనెల ధరలు రెండు రోజుల వ్యవధిలోనే లీటర్‌కు రూ.15-20 పెరిగాయి. పిండి వంటలకు ఎక్కువగా ఉపయోగించే వేరుశనగ నూనె గరిష్ఠంగా రూ.170కి చేరింది. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇది 45-50 రోజులకు సరిపోతాయని తెలిపింది. కాగా అధిక దిగుమతులతో నూనె గింజల ధరలు దేశీయంగా పడిపోతుండటంతో కేంద్రం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచింది. దీంతో ధరలు పెరుగుతాయన్న వాదనలు వినిపిస్తుండటంతో పరిశ్రమ వర్గాలతో కేంద్రం సమావేశమై సూచనలు చేసింది.ఇదిలా ఉండగా బయట మాత్రం పరిస్థితే వేరేలా ఉంది. కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల నూనెల ధరలు రెండు రోజుల వ్యవధిలోనే లీటర్ కు రూ.15-20 పెరిగాయి.పిండి వంటలకు ఎక్కువగా ఉపయోగించే వేరుశనగ నూనె గరిష్ఠంగా రూ.170కి చేరింది. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## రైల్లో ఫుడ్ డెలివరీ.. మరిన్ని స్టేషన్లలో

# 'జొమాటో' సేవలు

రైలు ప్రయాణికులకు జొమాటో తన సేవలను విస్తరించింది. ట్రైన్‌లో ఉండగా ఫుడ్ ఆర్డర్ చేస్తే సీట్ల వద్దకే డెలివరీ చేస్తోంది. 2023లో 5 ప్రధాన రైల్వే స్టేషన్లలో ఈ సేవలు అందుబాటులోకి రాగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 100 స్టేషన్లలో అందిస్తోంది. ఇప్పటివరకు 10లక్షల ఆర్డర్లు డెలివరీ చేసింది. వెయిటింగ్ ప్యాసింజర్లకూ ఈ సేవలను అందిస్తోంది. ప్రయాణికులు తమకు నచ్చిన రెస్టారెంట్ నుంచి నచ్చిన ఫుడ్‌ను ఆర్డర్ చేయవచ్చు.



# లవ్ టుడే రీమేక్

2022లో తమిళ్ లో చిన్న సినిమాగా వచ్చిన 'లవ్ టుడే' భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ డ్రామాగా వచ్చిన లవ్ టుడే ప్రదీప్ రంగనాథన్ హీరోగా, దర్శకుడిగా తెరక్కించాడు. ఇవానా హీరోయిన్ గా నటించగా, యువన్ శంకర్ రాజా సంగీతం అందించాడు. లవర్స్ ఫోన్స్ మార్చుకునే కాన్సెప్ట్ తో ప్రేక్షకులను మెప్పించింది ఈ సినిమా. తెలుగులో కూడా డబ్బింగ్ రిలీజయి మంచి విజయం సాధించింది. కేవలం 5 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా 100 కోట్లు కలెక్ట్ చేసింది.ప్రస్తుతం లవ్ టుడే నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమాను బాలీవుడ్ లో రీమేక్ చేయబోతున్నారని గతంలోనే వార్తలు వచ్చాయి. తాజాగా మరోసారి లవ్ టుడే రీమేక్ వార్తలు బాలీవుడ్ లో వైరల్ అవుతున్నాయి. అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా, జాన్వీ కపూర్ చెల్లి ఖుషి కపూర్ హీరోయిన్ గా అద్వైత్ చందన్ దర్శకత్వంలో లవ్ టుడే సినిమా రీమేక్ అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి.అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మొదటి సినిమా మహారాజా ఇంకా రిలీజ్ అవ్వలేదు. ఖుషి కపూర్ ఒక సినిమా చేసింది. ఇప్పుడు వీళ్ళిద్దరూ లవ్ టుడే రీమేక్ లో నటించబోతున్నారు తెలుస్తుంది. ఇటీవల సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లి రీమేక్ అయిన సినిమాలేవీ అంతగా సక్సెస్ అవలేదు. మరి సౌత్ ప్రేక్షకులని మెప్పించిన లవ్ టుడే బాలీవుడ్ లో సక్సెస్ అవుతుందా చూడాలి.

## రోగికి 'అదుర్స్' సినిమా చూపిస్తూ..

## మెలకువలో ఉండగానే మెదడులోని

# కణితి తొలగింపు

కాకినాడలోని సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) లో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఓ మహిళా రోగికి ఈ సర్జరీ జరిగింది. అయితే సర్జరీ సమయంలో రోగి తన చేతులతో ట్యాబ్ పట్టుకుని సినిమా చూస్తూ ఉండగా.. వైద్యులు ఆమె తలలో కణితిని విజయవంతంగా తొలగించారు. అవేక్ క్రేనియాటమీ అనే క్లిష్టమైన చికిత్సను రోగి మెలకువలో ఉండగానే చేయవల్సి ఉంటుంది. దీంతో జీజీహెచ్ వైద్య బృందం రోగి సినిమాలో నిమగ్నమై ఉండగా చికిత్స పూర్తి చేశారు. వివరాల్లోకెళ్తే.. తొండంగి మండలం ఎ కొత్తపల్లికి చెందిన ఎ అనంతలక్ష్మి (55) అనే మహిళకు గత కొంతకాలంగా కుడికాలు, కుడిచేయి లాగుతుండటంతో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నారు. అయితే ఆమె తలలో పెద్ద కణితి ఉందని, ఇది ఖర్చుతో కూడిన వైద్యమని, నయం కావడం కష్టమని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 11న ఆమెకు తలనొప్పి, మూర్ఛ, శరీరంలో కుడివైపు భాగాలు మొద్దుబారిపోయి పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి మెదడులో ఎడమవైపు 3.3x2.7 సెం.మీ.ల పరిమాణంలో కణితి ఉన్నట్లు గుర్తించి, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పాడు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఆమెకు అతి తక్కువ మోతాదులో మత్తు ఇచ్చి ఆమె మెలకువలో ఉండగానే శస్త్రచికిత్స చేసి దానిని తొలగించారు. శస్త్ర చికిత్స సమయంలో అనంత లక్ష్మి తనకు ఇష్టమైన 'అదుర్స్' సినిమా చూస్తూ, అందులోని కామెడీకి ఆనందంలో ఉండగా నొప్పి తెలియనివ్వకుండా ఆపరేషన్ ముగించారు. ఆపరేషన్ తర్వాత ఆమె లేచి కుర్చుని, అల్పాహారం తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో మొదటిసారిగా ఈ తరహా శస్త్రచికిత్స చేశామని వైద్యులు తెలిపారు. అనంత లక్ష్మిని మరో అయిదు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని అన్నారు. దాదాపు రెండున్నర గంటలపాటు న్యూరోసర్జరీ శస్త్రచికిత్స సీనియర్ వైద్యులు, మత్తు వైద్యుల పర్యవేక్షణలో ఈ శస్త్ర చికిత్స సాగిందని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, న్యూరోసర్జరీ విభాగం వైద్య నిపుణులు తెలిపారు. ఈ శస్త్రచికిత్స చేసిన వైద్య బృందంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.డీకే గిరిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ టి గౌతమ్, డాక్టర్ గోపి, పీజీ వైద్యులు డాక్టర్ అరవింద్, డాక్టర్ సాయితేజ, డాక్టర్ సాయిరాం, డాక్టర్ శ్రావణి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ అబు ఉన్నారు.



